

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE


సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 199 | ఎడిటర్ : బరిగెల శివ | శుక్రవారం, 19, జూన్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్

# సర్ ప్రక్రియపై సర్వత్రా అనుమానాలు!



ఎన్నికలకు రెండున్నర ఏళ్లకు ముందే తెలుగు రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ హడావిడి

తెలుగు ప్రజల లక్షల ఓట్లు కొల్లగొట్టడమే సర్ ప్రక్రియ లక్ష్యమా

తెలుగు రాష్ట్రాల ప్రజలకు సర్ ప్రక్రియపై అవగాహన తక్కువ

సర్ ప్రక్రియ విధివిధానాలను అధికారికంగా బయట పెట్టండి


ఎవరి లబ్ధి కోసం సర్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు

అల్లాడిపోతున్న ప్రజలపై అంత చిక్కని వేధింపులేంది

సర్ ప్రక్రియపై కలెక్టర్లకే కొసమెరుపు పరిజ్ఞానం ?

ఇప్పటికే బలైపోయిన తెలుగు రాష్ట్రాలను ఇంకా బలికొంటారా

తెలుగు రాష్ట్రాల నిధులు దోచుకుంటున్నట్లుగా ఓట్లు దోచుకుంటున్నారు : డాక్టర్ బరిగెల శివ




## సర్ ప్రక్రియ సజావుగా సాగేనా

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

సర్ ప్రక్రియపై తెలుగు రాష్ట్రాల ప్రజలను సమన్వయ పరచాలని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు డాక్టర్ బరిగెల శివ కోరారు.తెలుగు రాష్ట్రాలలో ప్రారంభమైన ఎస్ఐఆర్ ప్రక్రియ విధివిధానాలను అటు కేంద్ర ప్రభుత్వం ఇటు ఇరు రాష్ట్రాల తెలుగు ప్రభుత్వాలు ఇప్పటివరకు బయట పెట్టకపోవడం తెలుగు రాష్ట్రాల ప్రజలను తీవ్రమైన ఆందోళనలకు గురి చేస్తుందన్నారు.ఓట్ల ప్రక్రియ సవరణ కొరకు కొత్త ఓట్ల నమోదు ప్రక్రియ విధానం కొరకు జరుగుతున్న ప్రక్రియలో భాగంగా కొత్త ఓట్లను చేర్చడం గాని పాత ఓట్లను తొలగించడం గాని ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధానంగా చేపట్టబోయే ముఖ్య ఉద్దేశంతో కూడిన పని అని తెలుస్తున్నప్పటికిని పశ్చిమ బెంగాల్ ,అస్సాం,మహారాష్ట్ర లాంటి రాష్ట్రాలలో ఇప్పటికే సర్ ప్రక్రియ పుణ్యమాని ప్రతి రాష్ట్రంలో లక్షల ఓట్లు తొలగించబడ్డాయని ప్రధానంగా ప్రతిపక్షాలను టార్గెట్ చేసుకుంటూ పలు రాష్ట్రాలలో అధికార బిజెపికి వ్యతిరేకంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన రాష్ట్రాలపై ప్రత్యేకమైన గురిపెట్టి ఆయ రాష్ట్రాల్లోని ఓటర్ల శాతాన్ని పూర్తిగా తొలగిస్తూ ప్రభుత్వాలను కూల్చివేయడం కొరకు ఏర్పాటు చేసుకోవడం బలమైన ఆయుధమే బిజెపి చేతిలోని సర్ ప్రక్రియ అని దేశ ప్రజలు పూర్తిగా పసిగట్టినప్పటికిని జాతీయ ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియ విధానాన్ని ప్రవేశపెడుతూ ఆయా రాష్ట్రాల


- మిగతా 2లో..



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్



## మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఉర్దూ అకాడమీ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా ముషాయిరా

వేగంగా రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణం

కొత్త స్మశాన వాటికల స్థల సేకరణపై కలెక్టర్లకు ఉత్తర్వులు

డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడి

సమావేశానికి హాజరైన మంత్రి హజారుద్దీన్

కార్పొరేషన్ చైర్మన్లు

7



## విజయవాడ లాకప్ డెత్ ఘటనపై కేశినేని నాని ఆగ్రహం

పోలీసు కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి.. స్వతంత్ర న్యాయ విచారణ జరపాలి: డిమాండ్

2



## టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో 'మహిళా శక్తి క్యాంటీన్

5


పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి

## కాంగ్రెస్‌లో వారసుల రాజకీయాల జోరు..?

పాలకుర్తి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో టికెట్లపై ముందస్తు కసరత్తు

2





## జూన్ 30న రైతు భరోసా నిధుల విడుదల

మధిరలో భారీ రైతు సమ్మేళనం..

ఏడు రకాల సన్నాలకు బోనస్ ప్రకటించిన ప్రభుత్వం

హైద్రాబాద్, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)

వానాకాలం పంటలకు రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా నిధులను ఈ నెల 30న విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఖమ్మం జిల్లా మధిరలో భారీ స్థాయిలో రైతుల సమ్మేళనం నిర్వహించి, అదే వేదికపై రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతుల ఖాతాల్లో

- మిగతా 2లో..

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# జూన్ 30న రైతు భరోసా నిధుల విడుదల

మొదటి పేజీ తరువాయి

జమ చేసే ప్రక్రియను ప్రారంభించనున్నారు. రాష్ట్రంలో పండుతున్న సన్న ధాన్యాన్ని ప్రోత్సహించేందుకు ఏడు రకాల సన్నాలకు బోనస్ చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బీపీటీ-5204, ఆర్ఎన్ఆర్-15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-1638, డబ్ల్యూజీఎల్-44, కేఎన్ఎం-7715 రకాల ధాన్యాలకు ఈ బోనస్ వర్తించనుంది. మార్కెట్‌లో ఉన్న డిమాండ్, ప్రజల వినియోగం, అధిక దిగుబడిని పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రులు తెలిపారు. ఈ ఏడాది తెలంగాణ రైతులు దేశంలోనే రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి చేశారని, ప్రభుత్వం ఇప్పటికే దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని వెల్లడించారు. రాష్ట్రంలో పండించిన మొత్తం ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని సమావేశం కోరింది. వానాకాలం సీజన్‌కు అవసరమైన ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రుల సమావేశం కోరింది. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎరువుల సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఢిల్లీ వెళ్లి కేంద్రాన్ని మరోసారి కలవాలని నిర్ణయించింది. తెలంగాణలోని రామగుండం ఫర్టిలైజర్ కార్పొరేషన్‌లో ఉత్పత్తి అవుతున్న యూరియాలో అత్యధిక వాటాను రాష్ట్రానికే కేటాయించాలని సమావేశం డిమాండ్ చేసింది. దీంతో రవాణా ఖర్చులు తగ్గడంతో పాటు రైతులకు సకాలంలో యూరియా అందుతుందని అభిప్రాయపడింది. అలాగే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కేంద్రం ప్రతిపాదించిన మార్పులపై అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశారు. మెట్రో ఫేజ్-2 విస్తరణకు అవసరమైన అనుమతులు, ఐఆర్ఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాలను వెంటనే మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఇదిలా ఉండగా, ఈ నెల 21న నిర్వహించే జాతీయ స్థాయి నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని సమావేశం నిర్ణయించింది. రాష్ట్రంలోని 208 పరీక్ష కేంద్రాల్లో దాదాపు 2.95 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు మంత్రులు వెల్లడించారు. ఈ సమావేశం అనంతరం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ధనసరి అనసూయ సీతక్క మీడియా సమావేశంలో ఈ వివరాలను వెల్లడించారు.

# విజయవాడ లాకప్ డెత్ ఘటనపై కేశినేని నాని ఆగ్రహం

**పోలీసు కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి.. స్వతంత్ర న్యాయ విచారణ జరపాలి: డిమాండ్**

**విజయవాడ,18 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

విజయవాడలో చోటుచేసుకున్న లాకప్ డెత్ ఘటనపై మాజీ ఎంపీ కేశినేని నాని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో కేశినేని నాని మాట్లాడుతూ, మీడియా ముందు “నా కొడుకు శవాన్ని అయినా నాకు చూపించండి” అంటూ బాధితుడి తల్లి విజయలక్ష్మి విలపించిన తీరు పోలీసు వ్యవస్థకు మచ్చ తెచ్చే ఘటనగా అభివర్ణించారు. ఒక వ్యక్తిపై నేర చరిత్ర ఉన్నా, అతనికి శిక్ష విధించే అధికారం న్యాయస్థానాలకు మాత్రమే ఉందని, పోలీసులకు కాదని స్పష్టం చేశారు. గాదె సాయికృష్ణను మే 9న అదుపులోకి తీసుకున్న తర్వాత కోర్టు ముందు హాజరుపరచకుండా 35 రోజులకు పైగా అక్రమ కస్టడీలో ఉంచి మరణానికి కారణమయ్యారని ఆరోపించారు. నేర నియంత్రణ పేరుతో పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదకర సంకేతమని పేర్కొన్నారు. ఈ ఘటనను కేవలం ఒక సీఐ బదిలీతో ముగించేందుకు ప్రయత్నించడం సరైంది కాదని, కృష్ణలంక సీఐ నాగరాజును వీఆర్‌కు పంపడం ద్వారా అసలు బాధ్యులను కాపాడే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. కమిషనరేట్ పరిధిలో ఇంత తీవ్రమైన ఘటన జరిగితే నగర పోలీస్ కమిషనర్ బాధ్యత వహించాల్సిందేనని, “కమాండ్ రెస్పాన్సిబిలిటీ” సూత్రం ప్రకారం సీపీ ఎస్.వి. రాజశేఖర బాబుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విజయవాడలో పోలీసులు అరాచకంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపించిన ఆయన, ఈ రోజు ఒక రౌడీషీటర్ పేరుతో అక్రమంగా ప్రాణాలు తీసే పరిస్థితి ఉంటే, రేపు అదే పరిస్థితి సామాన్య ప్రజలకూ ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నగరంలో అకారణ వేధింపులు, అర్ధరాత్రి దాడుల ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మూడు ప్రధాన డిమాండ్లను కేశినేని నాని ప్రభుత్వ ముందుంచారు. కస్టడీ మరణ ఘటనకు పరోక్ష బాధ్యత వహించిన ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని, ఘటనపై సెక్షన్ 176(1ఏ) కింద స్వతంత్ర న్యాయ విచారణ చేపట్టాలని, కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన సీసీటీవీ సర్వర్ లాగ్‌లను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగే వరకు, విజయవాడ పోలీసులపై ఉన్న ఆరోపణలను జాతీయ మానవ హక్కుల కమిషన్ దృష్టికి తీసుకెళ్లి తన పోరాటాన్ని కొనసాగిస్తానని కేశినేని నాని స్పష్టం చేశారు.

# ముగిసిన బ్రహ్మనాయుడు కస్టడీ

**కోర్టుకు తరలించిన పోలీసులు**

**హైదరాబాద్,జూన్18(జై భీమ్ న్యూస్) :**

ఫేక్ జీవో కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కస్టడీ పూర్తయ్యింది. మూడురోజుల కస్టడీ ముగియడంతో బొల్లా బ్రహ్మనాయుడిని రంగారెడ్డి జిల్లా కోర్టుకు పోలీసులు తరలించారు. బ్రహ్మనాయుడిని సైబరాబాద్ ఈవోడబ్ల్యూ అధికారులు మూడు రోజులపాటు కస్టడీకి తీసుకొని విచారించారు. అయితే కస్టడీలో పోలీసులకు మాజీ ఎమ్మెల్యే ఏమాత్రం సహకరించనట్లు తెలుస్తోంది. ఏ ప్రశ్న అడిగినా 'తెలియదు, గుర్తులేదు' అనే సమాధానాలు చెప్పినట్లు సమాచారం. రూ.1000 కోట్ల భూమిని అక్రమంగా కొట్టేయాలని బ్రహ్మనాయుడు ఎ÷-లాన్ చేసినట్టు ఈవోడబ్ల్యూ అధికారుల విచారణలో వెల్లడైంది. భూమిని కొట్టేసేందుకు బ్రహ్మనాయుడు రూ.8 కోట్లు సమకూర్చినట్లు అధికారులు గుర్తించారు. దీనిపైనే ప్రశ్నలు వేయగా.. మాజీ ఎమ్మెల్యే సమాధానాలు దాటవేసినట్లు తెలుస్తోంది. మరికొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉంటూ తనకేం తెలియదని బుకాయించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఐదుగురు నిందితులు కస్టడీలో వెల్లడించిన వివరాలను ఆధారంగా చేసుకొని బ్రహ్మనాయుడిని అధికారులు ప్రశ్నించారు. 'వారు చెప్పిన సమాధానాలకు నాకు ఎలాంటి సంబంధం లేదు' అని పోలీసుల ముందు బ్రహ్మనాయుడు బుకాయించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.

# సర్ ప్రక్రియపై సర్వత్రా అనుమానాలు

మొదటి పేజీ తరువాయి


ప్రభుత్వాలను తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురి చేయడమే కాకుండా ఆయా రాష్ట్రాలపై దౌర్జన్యమైన క్రియలకు పాల్పడుతూ సర్ ప్రక్రియ విధానాన్ని కొనసాగిస్తుందని నిలదీశారు.పశ్చిమబెంగాల్ ఎన్నికలు ముగిసి కనీసం నెలలు గడవకముందు 4 వేల ఈవీఎం మిషన్స్ పరికరాలు దగ్ధమవడం వాటిని దగ్ధం చేయుటలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కావాలనే కాల్చివేయడం ఎంతటి అప్రజాస్వామ్యమైన పద్ధతిని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తుందో దాన్నిబట్టి చూస్తే అర్థమవుతుంది అన్నారు.ఇదంతా కేవలం ఓట్ల ప్రక్రియను ఓట్ల శాతాన్ని సాధారణ ప్రజల ఓట్లను చిన్నాభిన్నం చేయడానికి కొనసాగించబడుతున్న బలవంతపు ప్రక్రియలుగా పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వాల అంగీకారం లేకుండా కేంద్ర ప్రభుత్వం గానీ ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయా రాష్ట్రాలలో కొనసాగించడానికి వీలులేదని తెలిసినప్పటికిని ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా జరుగుతున్న కేంద్ర ప్రభుత్వ బలవంతపు ఒత్తిడి నిర్ణయాలను ఆయా రాష్ట్రాలలో ప్రవేశ పెడుతూ ఆయా రాష్ట్రాల ప్రభుత్వాల ఉనికిని దెబ్బతీస్తూ ప్రజల మనోభావాలను పూర్తిగా అణిచివేస్తున్నారని తెలియజేశారు.

### ప్రణాళికలు లేని ఎస్ఐఆర్ ప్రక్రియ..

ఉన్నపాటుగా తెలుగు రాష్ట్రాలలో ఎస్ఐఆర్ ప్రక్రియ ఎందుకు ప్రారంభించబడినదో తెలుపడానికి బిజెపి నాయకులకే కాదు కదా జాతీయ ఎన్నికల కమిషన్ దగ్గర కూడా ఏ మాత్రం సమాధానం చెప్పే విధానం తెలియడం లేదని స్పష్టంగా తెలిసిపోతుంది అన్నారు.తెలుగు రాష్ట్రా బిజెపి నాయకులేమో ప్రభుత్వాలను కూలదోస్తాం అన్ని విధాలుగా భయ ప్రయోగాలు చేసి,ఇతర రాష్ట్రాల్లో ప్రవేశపెట్టిన విధానాన్ని తెలుగు రాష్ట్రాల్లో ప్రవేశపెట్టి ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తామని గట్టిగా ఒక్కనించి చెబుతుంటే తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు మౌనం ప్రదర్శించడం వెనకాల తెలుగు ప్రజలకు ఎక్కడ లేని అనుమానాలు కలుగుతున్నాయని తెలిపారు.ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నటువంటి ఓట్ల శాతం ఎన్ని కోట్ల జనాభా ఓటు హక్కును కలిగి ఉన్నారో జాతీయ ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ స్పష్టంగా తెలియజేస్తూ లెక్కలను, ఆధారాలను నియోజకవర్గాల వారిగా విషధీకరించాల్సింది పోయి ఏ విధమైనటువంటి ఓట్ల శాతం లెక్కలను బయటపెట్టకుండా సర్ ప్రక్రియను ప్రారంభిస్తూ ప్రజల ఓట్లను తొలగిస్తూ బలవంతంగా ప్రభుత్వాలను లాక్కుంటామంటే రాష్ట్రాల భవిష్యత్తు ఏం కావాలని మండిపడ్డారు.అదేవిధంగా నియోజకవర్గాల వారిగా ఎన్ని లక్షల ఓట్లు తొలగించబడుతున్నాయో ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం నుండి ప్రతి జిల్లాలోని జిల్లా ఎని ఎన్నికల కమిషన్ కమిషనర్ కార్యాలయం సాక్షిగా ఆధారాలను ఓట్ల శాతాన్ని బయటపెట్టాలని తద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియ నిజాయితీ తెలుగు రాష్ట్రాల్లో ఏ విధంగా సాగుతుందో ప్రజల నిర్ణయించుకుంటారని తెలిపారు.ఒకవైపు డీలిమిటేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి తెలుగు రాష్ట్రాల్లో నియోజకవర్గాల పెంపుకు కేంద్ర ప్రభుత్వం సంసిద్ధమవుతున్నట్లుగా పలు విధాలుగా మభ్యపెట్టి అట్టి ప్రక్రియను మధ్యలోనే నిలుపుదల చేసిన సంఘటన తెలుగు రాష్ట్రాల ప్రజలు గుర్తు చేస్తున్నారన్నారు.ఇప్పటికే తెలుగు రాష్ట్రాలలో అన్ని కులాల కుల విభజన జరిగాయని కులాల విభజన ఆధారంగా ఆయా కులాలలో ఎంత శాతం జనాభా ఉన్నారో ఎంత శాతం జనాభాకు ఓట్లు కలిగి ఉన్నారో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పష్టంగా లెక్కలు తేల్చేయాలని వాటన్నిటికి విరుద్ధంగా జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ ఏ కులానికి చెందిన ఓట్ల శాతాన్ని తొలగించే ప్రయత్నం చేస్తుందో స్పష్టత లేకుండా, ప్రణాళిక లేకుండా తెలుగు రాష్ట్రాల ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు.హైదరాబాదులో స్థానికంగా స్థిరపడ్డ ఆంధ్రప్రదేశ్ ప్రజల ఓట్లను తొలగించాల్సి వస్తే మొట్టమొదట ఇటు తెలంగాణలో అటు ఆంధ్రాలో ఓటు హక్కులు కలిగి ఉన్న రాజకీయ నాయకుల ఓట్లను రాజకీయ పార్టీలకు తీతంగా తొలగించి ఎస్ఐఆర్ ప్రక్రియ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు.దానితోపాటు దేశవ్యాప్తంగా జమిలి ఎన్నికల విధానం ప్రవేశపెట్టబోతున్నామని ప్రాబదండ చేసి కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహిస్తూ జాతీయ ఎన్నికల కమిషన్ విధించబోయే కఠినమైన ఆంక్షలు బిజెపికి వ్యతిరేక పార్టీలకు అనువదింపజేస్తూ ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలను అకారణంగా కూల్చివేస్తున్నారని తీవ్రంగా హెచ్చరించారు.భారత రాజ్యాంగానికి విరుద్ధమైన ప్రణాళికలను సిద్ధం చేసి అన్ని రాష్ట్రాలపై బలవంతంగా ప్రయోగిస్తూ బిజెపికి అనుకూలమైన రాష్ట్రంలో సానుకూలమైన వాతావరణంలో ఏర్పాటు చేసుకుంటూ బిజెపికి వ్యతిరేకమైన రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ విధానాలను ప్రవేశ పెడుతూ ప్రణాళికలు లేని పద్ధతులను కొనసాగిస్తున్నారు తీవ్రంగా హెచ్చరించారు.ప్రజల మనోభావాలతో ఏ విధమైన సంబంధం లేకుండా ప్రతి ఇంటికి గడపగడపకు విచారణ కొనసాగించకుండా ప్రాంతాలవారీగా నియోజకవర్గాల వారీగా రాష్ట్రాల వారీగా విభాగిస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేస్తున్నామంటూ ప్రజలను ప్రజల ప్రయోజనాలను పూర్తిస్థాయిలో నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్న కేంద్ర ఎన్నికల కమిషన్ విధానాలు కచ్చితంగా మారితీరాలన్నారు.బిజెపి అవలంబిస్తున్న బలవంతపు ఒంటెద్దు పోకోడలను కేంద్ర ఎన్నికల కమిషన్ తో పాటు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు నిర్దాక్షిణ్యంగా కొనసాగిస్తూ ప్రజలపై రుద్దుతూవున్నారని హెచ్చరించారు.

### ఎస్ఐఆర్ ప్రక్రియతో ఎవరికి లాభం..

ఎస్ఐఆర్ ప్రక్రియ అనేది కేవలం రాజకీయంగా బలపడాలనుకునే రాజకీయ పార్టీలకు మాత్రమే ఉపయోగకరంగా లాభసాయంగా ఉంటుందని స్పష్టం చేశారు.సర్ ప్రక్రియ వల్ల తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేదని అదనంగా తెలుగు రాష్ట్రాల ప్రజలపై కొండంత భారాన్ని వేస్తూ లక్షలాది ఓట్లను కోట్లాది ఓట్లను తొలగించే భయంకరమైన కుట్రపూరితమైన విధానాన్ని తెలుగు రాష్ట్రాల్లో అవలంబించబోతున్న బిజెపి పార్టీకి మాత్రమే ఎస్ఐఆర్ ప్రక్రియ విధానం ఎంతగానో ఉపయోగపడుతున్నట్లుగా తెలుగు రాష్ట్రాల ప్రజలు తీవ్రమైన వ్యతిరేకతను వ్యక్తపరుస్తున్నారని తెలిపారు.ప్రజలకు ఇష్టం లేకున్నా,ప్రభుత్వాల క్యాబినెట్లకు ఆమోదయోగ్యం లేకున్నా కేంద్రం తెలుగు రాష్ట్రాలపై ఏకచత్రాధిపత్యం కొనసాగించడం రాజ్యాంగ విలువలపై రాక్షసత్వాన్ని ప్రదర్శిస్తున్నట్లుగా ఉందన్నారు.జాతీయ ఎన్నికల కమిషన్ కు చిత్తశుద్ధి ఉంటే సర్ ప్రక్రియ కొనసాగించిన విధానంపై స్పష్టమైన ఆధారాలను స్పష్టమైన ప్రణాళికలను స్పష్టమైన సిద్ధాంతాలను స్పష్టమైన అనుకరణను స్పష్టమైన సమన్యాయాన్ని శ్వేత పత్రం రూపంలో విడుదల చేయాలని డిమాండ్ చేశారు.తెలుగు రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ ప్రారంభమై వేగవంతంగా ముందుకు సాగుతున్న వేళ జాతీయ ఎన్నికల కమిషన్ గాని కేంద్ర ప్రభుత్వం గానీ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న బిజెపి పార్టీల నాయకులు గాని తెలుగు రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్ధారించిన ఓట్ల శాతంతో బ్యాలెట్ ఎన్నికలకు ముందుకు వస్తూ పూర్తిస్థాయిలో ఆమోదించి వాళ్ళ చిత్తశుద్ధిని చూపించుకోవాలని పిలుపునిచ్చారు.కావాలనే ఓట్లు తొలగిస్తున్నప్పుడు తెలుగు రాష్ట్రాల ప్రజల అభీష్టానం మేరకు బ్యాలెట్ ఎన్నికల నిర్వహిస్తే బిజెపి పార్టీ బండారం బయటపడుతుందని అలా కాకుండా ఈవీఎం మిషన్స్ ద్వారా జరిగించబడే ఎన్నికలతో బయటపడాలని ఎంతటి క్రూరత్వాన్ని ప్రదర్శిస్తున్నారో తెలుగు రాష్ట్రాల ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.ప్రజలకు మేలు చేయలేని కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల నుండి లెక్కలేనంత సొమ్మును బలవంతంగా లాక్కుంటూ తెలుగు రాష్ట్రాల ప్రజల అభివృద్ధికి పూర్తిగా అడ్డుకట్ట వేస్తూ ప్రజల్ని మోసగిస్తున్నారని హెచ్చరించారు.తెలుగు రాష్ట్రాలలో కొనసాగించబడుతున్న కేంద్ర ప్రభుత్వం బలవంతపు రాజకీయ ఒత్తిళ్లు పూర్తిగా నశించాలని నిలదీశారు.ఎస్ఐఆర్ ప్రక్రియ విధానంతో తెలుగు రాష్ట్రాల్లో ఎన్ని లక్షల ఓట్లు ఎన్ని కోట్ల ఓట్లు తొలగిస్తున్నారో ఓట్ల తొలగింపు ప్రక్రియ విచారణ జరుగుతున్న రోజువారీగా వివరాలన్నీ బయటపెడుతూ కొత్త ఓట్లను ఏ విధంగా నమోదు చేస్తున్నారో వాటి ఆధారాలను కూడా ఎప్పటికప్పుడు అటు జాతీయ ఇటు రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెబ్సైట్లో పొందుపరిచి బలవంతపు రాజకీయ ఒత్తిళ్లతో కూడిన ప్రక్రియలకు ప్రయత్నాలు చేయడం లేదని నిరూపించుకోవాలన్నారు. ఏదేమనా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు తెలుగు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు తెలుగు రాష్ట్రాల ప్రజలు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు సర్ ప్రక్రియ విధానంపై ప్రజలకు ప్రజాస్వామ్యవాదులకు నిర్దిష్టమైన విషయాలను విశదీకరిస్తూ ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగించబోయే పద్ధతుల నుండి ఏ విధంగా బయటపడాలో 12 కోట్ల ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.కులాల వారిగా విడగొట్టి మతాలవారీగా చిచ్చు రేపుతూ బిజెపి పార్టీకి పడని కులాలకు చెందిన ప్రజల ఓట్లను తొలగిస్తూ రాజకీయాలు చేస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.ప్రజలందరూ ఎస్ఐఆర్ ప్రక్రియపై స్పష్టమైన అవగాహన పెంచుకుంటూ ఎస్ఐఆర్ ప్రక్రియ విచారణలో భాగంగా ప్రతి ఇంటికి వస్తున్న అధికారులు ప్రతి కుటుంబంలోని ఓట్ల సంఖ్య ఆధారాలను తీసుకుంటున్న క్రమంలో వాళ్ల వద్ద నుండి లిఖిత పూర్వకంగా విచారణ పత్రాలను తీసుకొని పొందుపరచుకోవాలని సూచించారు.ఇప్పటికే ఎంతో నష్టపోయిన తెలుగు రాష్ట్రాలు బిజెపి కుట్రలకు తలొగ్గద్దని మరొకసారి తెలియజేశారు.




# కాంగ్రెస్‌లో వారసుల రాజకీయాల జోరు..?

**పాలకుర్తి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో టికెట్లపై ముందస్తు కసరత్తు**

**హైద్రాబాద్, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీలో కొన్ని నియోజకవర్గాల్లో టికెట్ల రాజకీయాలు ఇప్పటి నుంచే వేడెక్కుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ముఖ్యంగా పాలకుర్తి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో వారసులను రాజకీయంగా ముందుకు తీసుకురావాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ప్రచారం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.పాలకుర్తి నియోజకవర్గంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన అల్లుడి రాజకీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వ్యూహాలు రచిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఆమె అత్త ఝాన్సీ రెడ్డిలతో విభేదాలు మరింత ముదిరినట్లు సమాచారం. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎమ్మెల్యే వర్గానికి వ్యతిరేకంగా పనిచేసిన కొందరు నేతలను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఝాన్సీ రెడ్డి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అయితే వారికి మద్దతుగా పొంగులేటి వియ్యంకుడు, ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి క్రమశిక్షణ కమిటీ ముందు వాదించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా పాలకుర్తి నుంచి తన కుమారుడిని రాజకీయ రంగంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో అసంతృప్తి నేతలను తన వైపు తిప్పుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం వినిపిస్తోంది. ఇక జహీరాబాద్ నియోజకవర్గంలో మంత్రి దామోదర రాజనర్సింహ తన కుమార్తె త్రిషను భవిష్యత్ ఎన్నికల్లో బరిలోకి దింపేందుకు సన్నాహాలు చేస్తున్నారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఇందుకు అడ్డుగా ఉన్న మాజీ మంత్రి చంద్రశేఖర్ రెడ్డి వర్గాన్ని బలహీనపర్చేందుకు స్థానిక నేతలతో తిరుగుబాటు రాజకీయాలు ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జహీరాబాద్ అసెంబ్లీ స్థానం కోసం ఎంపీ సురేష్ షెట్కార్ కూడా ఆసక్తి చూపుతున్నారని, ఆయన దామోదర వర్గానికి మద్దతుగా వ్యవహరిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ టికెట్ల కోసం ముందస్తు కసరత్తులు, వర్గపోరు, వారసుల రాజకీయాలు కాంగ్రెస్ పార్టీలో కొత్త చర్చకు దారితీస్తున్నాయి. అయితే ఈ ప్రచారాలు, ఆరోపణలపై సంబంధిత నేతలు అధికారికంగా స్పందించాల్సి ఉంది.



# నీట్ ఎగ్జామ్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం

**రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్,జూన్18(జై భీమ్ న్యూస్) :**

నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు . జూన్ 21న జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణం అందిస్తున్నట్లు ప్రకటించారు . పరీక్షా రాసే విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది నీట్ పరీక్ష కోసం.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక మార్పులను ప్రకటించింది. ఎగ్జామ్ ను మరింత పారదర్శకంగా, సురక్షితంగా, విద్యార్థులకు అనుకూలంగా మార్చేందుకు ఎన్టీఏ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. గతంలో ఉన్న నిబంధనలను సవరిస్తూ ఈసారి ఎగ్జామ్ టైంను 195 నిమిషాలకు పెంచారు. ఎగ్జామ్ మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు జరగనుంది. ఎగ్జామ్ ప్రారంభానికి ముందు అటెండెన్స్ డాక్యుమెంట్స్ పై సైన్ లు చేయడం, ఇన్విజిలేషన్ లాంఛనాలు పూర్తి చేయడం వంటి పరిపాలనాపరమైన పనుల వల్ల.. విద్యార్థులు తమకు కేటాయించిన రాత సమయాన్ని నష్టపోకూడదనే ఉద్దేశంతో ఎన్టీఏ ఈ అదనపు సమయాన్ని కేటాయించింది. దీనివల్ల అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాయడంపైనే పూర్తిగా దృష్టి పెట్టవచ్చు. ఎగ్జామ్ రోజున విద్యార్థులకు పూర్తి స్పష్టత, సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా తెచ్చిన ఈ కొత్త నిబంధనలను అభ్యర్థులందరూ గమనించాలని ఎన్టీఏ స్పష్టం చేసింది.

# హసన్‌పర్తి శిక్షణ కేంద్రంలో తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహణ కమిటీ సమావేశం

**గ్రామీణాభివృద్ధి శిక్షణలకు ప్రాధాన్యం - వార్షిక శిక్షణ ప్రణాళికకు ఆమోదం**




**హనుమకొండ, జూన్ 18 (జై భీమ్ ప్రతినిధి)**

హసన్‌పర్తి విస్తరణ శిక్షణ కేంద్రంలో తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ నిర్వహణ కమిటీ సమావేశం సంస్థ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 16 జిల్లాల ముఖ్య కార్యనిర్వాహణ అధికారులు, జిల్లా పంచాయతీ అధికారులు హాజరై గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సమగ్రంగా చర్చించారు. గ్రామ పంచాయతీల బలోపేతం, స్థానిక సంస్థల సామర్థ్య పెంపు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందికి అందించాల్సిన శిక్షణా కార్యక్రమాలపై సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. గ్రామాభివృద్ధి ప్రణాళికలు, ఆర్థిక వనరుల సమర్థ వినియోగం, పారిశుధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, డిజిటల్ సేవల వినియోగం, సామాజిక బాధ్యత, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలు వంటి అంశాలను శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా చేర్చాలని సభ్యులు సూచించారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే దిశగా రూపొందించిన వార్షిక శిక్షణ ప్రణాళికకు నిర్వహణ కమిటీ ఆమోదం తెలిపింది. శిక్షణా కార్యక్రమాల నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధిపై కూడా సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు. హసన్‌పర్తి శిక్షణ కేంద్రంలోని పాత పరిపాలనా భవనానికి మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు నిర్వహణ కమిటీ ఆమోదం తెలిపింది. అలాగే సంస్థ కార్యకలాపాలను వేగవంతంగా నిర్వహించేందుకు హైబ్రిడ్ నాలుగు చక్రాల వాహనాల కొనుగోలుకు కూడా అనుమతి మంజూరు చేసింది. గ్రామీణాభివృద్ధి లక్ష్యాల సాధనలో శిక్షణా సంస్థల పాత్ర అత్యంత కీలకమని సమావేశ అధ్యక్షులు పేర్కొన్నారు. నాణ్యమైన శిక్షణల ద్వారా ప్రజాప్రతినిధులు, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది సామర్థ్యాలను పెంపొందించి గ్రామాల అభివృద్ధికి మరింత సమర్థవంతంగా సేవలందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సంస్థకు చెందిన అధికారులు, సిబ్బంది, జిల్లా స్థాయి అధికారులు మరియు ఇతర ఆహ్వానితులు పాల్గొన్నారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలను మరింత ప్రభావవంతంగా అమలు చేసేందుకు ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు ఉపయోగపడనున్నాయని అధికారులు తెలిపారు.

## మద్యం మత్తులో వాహనాలు నడిపిన 21 మందికి జరిమానా

**లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేసిన వ్యక్తిపైనా చర్యలు**




**వరంగల్, 18 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ ట్రాఫిక్ పోలీసుల తనిఖీల్లో మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడిన 21 మందికి కోర్టు రూ.19,400 జరిమానా విధించింది. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ఓ వ్యక్తిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులను పోలీసులు గుర్తించి కేసులు నమోదు చేశారు. ఈ కేసులను విచారించిన వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శ్రీమతి రాజ్ నిధి, లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన వ్యక్తికి రూ.500 జరిమానా విధించారు. అదేవిధంగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన 21 మంది వాహనదారులకు మొత్తం రూ.19,400 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. సుజాత హెచ్చరించారు.

## బీఆర్ఎస్‌వీ విద్యార్థి నేత జట్టి రాజేందర్ అరెస్ట్‌పై ఆందోళన

**హసన్‌పర్తి, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలం బైరన్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్‌వీ కేయూ విద్యార్థి నేత జట్టి రాజేందర్‌ను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జట్టి రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు, యువతకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న విద్యార్థి నాయకులను అరెస్టులు, కేసులతో అణచివేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. ప్రజలకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరినందుకే తమపై చర్యలు తీసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి అరెస్టులతో విద్యార్థి ఉద్యమాలను అడ్డుకోలేరని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై బీఆర్ఎస్ పార్టీ, బీఆర్ఎస్‌వీ విద్యార్థి విభాగం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు కొనసాగిస్తామని జట్టి రాజేందర్ స్పష్టం చేశారు. ఈ ఘటనతో బైరన్‌పల్లి గ్రామంలో కొంత ఉద్రిక్తత నెలకొనగా, పోలీసులు పరిస్థితిని పర్యవేక్షించారు.



## చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించాలి

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన మంత్రి కొండా సురేఖ**



**హైద్రాబాద్, 18 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలోని వేలాది మంది చేనేత కార్మికుల ఉపాధి పరిరక్షణ కోసం చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించాలని రాష్ట్ర మంత్రి శ్రీమతి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు చేనేత కార్మికుల సమస్యలను వివరిస్తూ ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. వరంగల్ జిల్లా చేనేత సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 50కు పైగా చేనేత సహకార సంఘాలకు చెందిన సుమారు 5 వేల మంది చేనేత కార్మికులు గత మూడు దశాబ్దాలుగా రాష్ట్ర వస్త్రోత్పత్తి రంగానికి వెన్నెముకగా నిలుస్తున్నారని ఆమె పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల విద్యాసంస్థలు, ఇతర ప్రభుత్వ విద్యాసంస్థలకు అవసరమైన బెడ్‌షీట్లు, కార్పెట్లు, యూనిఫాంలు తదితర వస్త్ర ఉత్పత్తులను నిరంతరం సరఫరా చేస్తూ వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నారని వివరించారు. ప్రస్తుతం అమలులో ఉన్న కేంద్రీకృత టెండర్ విధానం వల్ల చేనేత సహకార సంఘాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, దీని ప్రభావం చేనేత కార్మికుల ఉపాధిపై పడే అవకాశం ఉందని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత రంగ పరిరక్షణ, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించాలని కోరారు. చేనేత కార్మికుల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, ఈ నిర్ణయం ద్వారా వేలాది మంది చేనేత కార్మికుల జీవనోపాధి భద్రపడుతుందని మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## ఐనవోలు మల్లన్న హుండీ లెక్కింపు

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**



ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి ఆలయ హుండీ లెక్కింపు గురువారం లెక్కించారు. 78 రోజులకు గాను హుండీ ద్వారా ఆదాయం రూ.9,98,694 వచ్చింది.వివిధ ఆర్థిక సేవ టికెట్ల ద్వారా రూ.43,99,767 ఆదాయం వచ్చినది.78 రోజులకు గాను మొత్తం ఆదాయం రూ.53,98,461 సమకూరినట్లు దేవాలయ కార్యనిర్వహణఅధికారి కందుల సుధాకర్ తెలిపారు.మిశ్రమ వెండి బంగారం సీల్ చేసి హుండీలో భద్రపరుచారు.ఈ హుండీ లెక్కింపు దేవాదాయ ధర్మాదాయ శాఖ,వరంగల్ డివిజన్ పరిశీలకురాలు నందనం కవిత ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ కమ్మగొని ప్రభాకర్, ఐనవోలు పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్స్ కనకస్వామి,పరమేశ్వరి, ధర్మకర్తల మండలి సభ్యులు, శ్రీ వెంకట అన్నమాచార్య సేవ ట్రస్ట్, కరీంనగర్ వారు దేవాలయ అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రీ-ప్రైమరీ విద్య బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది - ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు

**దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వ సేవలతో ఉన్నత స్థాయికి చేరే అవకాశం**
**జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజు గౌడ్**





**హన్మకొండ, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

హసన్‌పర్తి మండలంలోని జెడ్పీహెచ్ఎస్ భీమారం పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని, ఎంపీపీఎస్ భీమారంలో ప్రారంభించిన ప్రీ-ప్రైమరీ విభాగాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు నాణ్యమైన విద్య, వైద్య సేవలు, ఫిజియోథెరపీతో పాటు అవసరమైన సహాయక ఉపకరణాలు అందించేందుకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో భవిత కేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దివ్యాంగులు ఏ విషయంలోనూ తక్కువ కాదని, వారికి తగిన అవకాశాలు, ప్రోత్సాహం కల్పిస్తే విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రతిభ చాటగలరని పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ దివ్యాంగులను ఆదరిస్తూ వారి సంక్షేమానికి సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎంపీపీఎస్ భీమారంలో ప్రీ-ప్రైమరీ విభాగాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక విద్య బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. హసన్‌పర్తి మండలంలోని 11 పాఠశాలలకు ప్రీ-ప్రైమరీ విభాగాలు మంజూరయ్యాయని, 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు పునాది స్థాయిలోనే నాణ్యమైన విద్య అందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ప్రవేశం పొందిన చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజు గౌడ్ మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఫౌండేషన్ స్థాయిలోనే విద్యార్థులకు ఉత్తమ విద్య అందించడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మండల విద్యాశాఖ అధికారి ఏ. శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రీ-ప్రైమరీ విద్య చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వంటిదని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి అందుబాటులో ఉన్న సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. జిల్లా ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ సుమాదేవి మాట్లాడుతూ, దివ్యాంగ విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణ, థెరపీ సేవలు, విద్యా సహాయక కార్యక్రమాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి దివ్యాంగ విద్యార్థి విద్యలో రాణించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ బి. మహేష్, భవిత కేంద్ర సిబ్బంది, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రముఖులు శివరాంప్రసాద్, ఎర్రగట్టు దేవస్థాన చైర్మన్, జెడ్పీహెచ్ఎస్ దేవన్నపేట స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ఎంపీపీఎస్ భీమారం ప్రధానోపాధ్యాయులు వాసుదేవరెడ్డి, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు బిల్లా మహేందర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

**నిరుద్యోగ యువతకు మైనార్టీ సంక్షేమ శాఖ అవకాశం**

**హన్మకొండ, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**




తెలంగాణ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత పోటీ పరీక్షల కోచింగ్ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం. శ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన, పార్సీ తదితర మైనార్టీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు ఈ ఉచిత కోచింగ్ అందించనున్నట్లు పేర్కొన్నారు. టీజీపీఎస్సీ గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, ఎస్ఎస్సీ-సీజీఎల్, యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు పరీక్షలు, ఐబీపీఎస్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అలాగే అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్ఓ), ఇంటెలిజెన్స్ బ్యూరో, సీబీఐ, ఎన్ఐఏ, ఎన్సీబీ తదితర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన పరీక్షలకు కూడా కోచింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ మే 21 నుంచి ప్రారంభమై జూన్ 22 ఉదయం 11 గంటల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. కోచింగ్ దరఖాస్తుల ఎంపిక ప్రక్రియ జూన్ 20 నుంచి 25 వరకు నిర్వహించి, ఎంపికైన అభ్యర్థులకు జూన్ 25 నుంచి శిక్షణ ప్రారంభిస్తామని తెలిపారు. అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండాలని, విద్యార్హతలు సంబంధిత ఉద్యోగ నోటిఫికేషన్‌కు అనుగుణంగా ఉండాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌తో పాటు అవసరమైన అధ్యయన సామగ్రిని అందజేస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులు, పూర్తి వివరాల కోసం తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, హైదరాబాద్‌ను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 040-23236112, 9059050062 ఫోన్ నంబర్లను లేదా directormscctelangana@gmail.com ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

# మత్తు పదార్థాల నియంత్రణలో డ్రగ్స్ కంట్రోల్ టీం పనితీరు బేష్

### సీపీ సన్ ప్రీత్ సింగ్

**వరంగల్, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మాదకద్రవ్యాల నియంత్రణలో డ్రగ్స్ కంట్రోల్ టీం విశేష ఫలితాలు సాధించిందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. యువతను మాదకద్రవ్యాలు మరియు ఇతర చెడు వ్యసనాల బారిన పడకుండా కాపాడడమే లక్ష్యంగా 2024 జూలై 15న ఏర్పాటు చేసిన డ్రగ్స్ కంట్రోల్ టీం నిరంతరం నిఘా, సమాచార సేకరణ, ప్రత్యేక దాడులు నిర్వహిస్తూ గంజాయి సంబంధిత నేరాలను అరికట్టడంలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. 2024 జూలై 15 నుంచి 2026 జూన్ 16 వరకు డ్రగ్స్ కంట్రోల్ టీం చేపట్టిన చర్యల్లో మొత్తం 192 కేసులు నమోదు చేయగా, 403 మంది నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా 1,241.110 కిలోల గంజాయి, 7 గంజాయి మొక్కలు, 1.530 కిలోల ఓపియం, 22.4 లీటర్ల హాషీష్ ఆయిల్, 251 గంజాయి చాక్లెట్లు, 0.2 గ్రాముల బ్రౌన్ షుగర్ స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల మొత్తం విలువ రూ.8.57 కోట్లకు పైగా ఉందని అధికారులు తెలిపారు. అదేవిధంగా రూ.2.15 లక్షల నగదు, 601 మొబైల్ ఫోన్లు, 63 ద్విచక్ర వాహనాలు, 6 ఆటోలు, 8 కార్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ధూమపాన వ్యసనానికి గురైన 435 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి వారిలో అవగాహన కల్పించినట్లు వెల్లడించారు. వైద్యుల చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ లేకుండా నియంత్రిత మాత్రలను విక్రయిస్తున్న మెడికల్ షాపులపై ప్రత్యేక దాడులు నిర్వహించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, విద్యాసంస్థలు, పాఠశాలల పరిసర ప్రాంతాల్లో నార్కోటిక్ డిటెక్షన్ డాగ్స్ సహాయంతో ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన పరిణామాలపై పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ హాస్టళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గంజాయి సాగు, రవాణా, నిల్వ, సరఫరా లేదా అక్రమ విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వారు 8712685299, 8712584473 నంబర్లకు సమాచారం అందించాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని వరంగల్ పోలీసులు వెల్లడించారు. మత్తు పదార్థాల రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని, మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ముందుకు రావాలని పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు.

# అజాంజాహి మిల్లు భూముల వేలాన్ని వెంటనే నిలిపివేయాలి






### మిగిలిన 318 మంది కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డీఎస్‌ఏ, పీడీఎస్‌యూ డిమాండ్

**హన్మకొండ, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

అజాంజాహి మిల్లు భూముల బహిరంగ వేలాన్ని వెంటనే నిలిపివేసి, సుప్రీంకోర్టు తీర్పు మేరకు మిగిలిన కార్మికులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డీఎస్ఏ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ నెల 25న నిర్వహించనున్న అజాంజాహి మిల్లు భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ గురువారం కాకతీయ యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో రెండు సంఘాల ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ, 2022లో సుప్రీంకోర్టు అజాంజాహి మిల్లు భూముల్లో కార్మికులకే ఇళ్ల స్థలాలు కేటాయించాలని స్పష్టమైన తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ అధికారులు ఆ తీర్పును అమలు చేయకుండా భూములను బహిరంగ వేలం వేయడానికి సిద్ధమవడం న్యాయస్థానాన్ని ధిక్కరించడమేనని విమర్శించారు. మొత్తం 452 మంది కార్మికుల్లో ఇప్పటికే 134 మందికి స్థలాలు కేటాయించారని, మిగిలిన 318 మంది కార్మికులకు కూడా అదే భూమిలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం మిగిలి ఉన్న 20 ఎకరాలకు పైగా భూమిని కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిల్లు కార్మికులకు ఇళ్ల పట్టాలు అందజేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, వరంగల్ నగరానికి చారిత్రక గుర్తింపుగా నిలిచిన అజాంజాహి మిల్లు ప్రాంగణంలో కార్మిక భవనాన్ని నిర్మించాలని కోరారు. కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా భూముల వేలం ప్రక్రియ చేపడుతున్నారని ఆరోపించిన నాయకులు, వేలం నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ, నాయకులు జాషువా, బాలరాజు, రమేష్, విజయ్, రాము తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ జూ పార్క్‌లో రూ.1.50 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

### పక్షుల ఎన్‌క్లోజర్, అంతర్గత సీసీ రోడ్లను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి


**హన్మకొండ, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

హనుమకొండ నగరంలోని కాకతీయ జూ పార్క్‌లో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన పక్షుల ఎన్‌క్లోజర్‌తో పాటు అంతర్గత సీసీ రోడ్లను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వనమహోత్సవ కార్యక్రమం నుంచి ఈ అభివృద్ధి పనులను సీఎం ప్రారంభించారు. కాకతీయ జూ పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, జిల్లా అటవీ అధికారి (డీఎఫ్ఓ) బీ. లావణ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా జూ పార్క్ ప్రాంగణంలో ప్రజాప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటి నీళ్లు పోశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, జిల్లాలో ఈ ఏడాది వనమహోత్సవం కింద 18,17,400 మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. లక్ష్య సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటుతున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. పచ్చదనం పెంపుతో భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. కాకతీయ జూ పార్క్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక పక్షుల ఎన్‌క్లోజర్ సందర్శకులను ఆకట్టుకోవడంతో పాటు వివిధ జాతుల పక్షుల సంరక్షణకు దోహదపడుతుందని అధికారులు తెలిపారు. అలాగే అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణంతో జూ పార్క్‌లో సందర్శకులకు మెరుగైన రవాణా, సౌకర్యాలు అందుబాటులోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మయూరి, సెక్షన్ అధికారి శివకుమార్, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ప్రతినిధులు శ్యాంసుందర్, నాగేశ్వరరావు, విద్యార్థులు, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ అభ్యర్థులకు ఉచిత పోటీ పరీక్షల శిక్షణ

## జూన్ 25 నుంచి కోచింగ్ తరగతులు ప్రారంభం




**హన్మకొండ, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్సీ అభ్యర్థులకు ఉచిత పోటీ పరీక్షల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార అభివృద్ధి అధికారి ఎన్. శ్రీను తెలిపారు. హనుమకొండ జిల్లా కేంద్రంలోని ప్రగతి భవన్ కోచింగ్ లైబ్రరీలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ శిక్షణ ద్వారా టీజీ పి ఎస్సి గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, ఎస్ఎస్సి-సీజిఎల్, యూ.పి.ఎస్.సీ సివిల్ సర్వీసెస్, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్.ఆర్.బి), బ్యాంకింగ్, ఎస్ఐ, కానిస్టేబుల్ తదితర పోటీ పరీక్షలకు అభ్యర్థులను సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రైల్వే శాఖలో 11,127 అసిస్టెంట్ లోకో పైలట్ పోస్టులు, 6,565 టెక్నీషియన్ పోస్టులు, అలాగే ఎస్ఎస్సి సీజీఎల్ -2026లో 12,256 ఖాళీలు అందుబాటులో ఉన్న నేపథ్యంలో ఈ కోచింగ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు జూన్ 20 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జూన్ 25 నుంచి కోచింగ్ తరగతులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. మొత్తం 100 మంది ఎస్సీ అభ్యర్థులకు ఈ ఉచిత శిక్షణ అందించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హతల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 040-23236112, 9059050062 నంబర్లను సంప్రదించాలని అధికారులు తెలిపారు.

# ప్రధాన మంత్రి యోజన పేరుతో రూ.84,870 సైబర్ మోసం

## హసన్‌పర్తి వాసిని రుణం పేరుతో మోసం చేసిన సైబర్ నేరగాళ్లు




**హసన్‌పర్తి, 18 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రధాన మంత్రి యోజన పేరుతో సైబర్ మోసగాళ్ల బారిన పడి రూ.84,870 కోల్పోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాధితుడు గుడికందుల రాజు (45) హసన్‌పర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గుడికందుల రాజు యూట్యూబ్‌లో ప్రధాన మంత్రి యోజనకు సంబంధించిన వీడియోను వీక్షిస్తున్న సమయంలో రూ.4 లక్షల రుణం మంజూరు చేస్తామని పేర్కొన్న ప్రకటనకు ఆకర్షితుడయ్యాడు. అనంతరం వీడియోలో ఉన్న ఫోన్ నంబర్లను సంప్రదించగా, రుణం మంజూరు చేస్తామని నమ్మించి బ్యాంకు వివరాలు, ఆధార్ కార్డు, పాన్ కార్డు, రేషన్ కార్డు, ఫోటోలను వాట్సాప్ ద్వారా పంపించుకున్నారు. తదనంతరం బీమా, పన్నులు, ఎన్ఓసీ, ఈఎంఐ, ఆర్‌బీఐ రిజిస్ట్రేషన్ తదితర పేర్లతో విడతల వారీగా డబ్బులు చెల్లించాలని కోరారు. దీంతో బాధితుడు తన కెనరా బ్యాంకు ఖాతా ద్వారా పలు బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేయగా, తన స్నేహితుడు నూతి రంజిత్ కూడా ఒక విడతలో రూ.31,160 చెల్లించాడు. మొత్తంగా రూ.84,870 చెల్లించిన అనంతరం 48 గంటల్లో రుణం ఖాతాలో జమ అవుతుందని మోసగాళ్లు హామీ ఇచ్చారు. అయితే గడువు ముగిసిన తర్వాత కూడా డబ్బు రాకపోవడంతో బాధితుడు వారిని సంప్రదించేందుకు ప్రయత్నించగా, ఫోన్ నంబర్లు స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు గుర్తించాడు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును స్వీకరించిన అధికారులు అక్‌నాలెడ్జ్‌మెంట్ నంబర్ 33705250021779 కింద కేసును నమోదు చేశారు. ప్రధాన మంత్రి యోజన పేరుతో మోసం చేసిన నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తన డబ్బు తిరిగి వచ్చేలా సహకరించాలని బాధితుడు పోలీసులను కోరాడు. ఈ ఘటనపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# నీట్-2026 నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**అభ్యర్థుల సౌకర్యార్థం అన్ని పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం**


**హన్మకొండ, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్--2026 (నీట్ - యూజీ) ప్రవేశ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని హనుమకొండ అదనపు కలెక్టర్ రవి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆయన పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులు, పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 21న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు నీట్ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులకు అదనపు సమయం కల్పిస్తూ సాయంత్రం 6.15 గంటల వరకు పరీక్ష రాసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలోని 12 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 4,196 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లో ప్రవేశం కల్పిస్తామని, అనంతరం గేట్లు మూసివేస్తామని స్పష్టం చేశారు. ఆలస్యంగా వచ్చే వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదని హెచ్చరించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, ఒక పోస్టుకార్డు సైజు ఫోటో, ఒరిజినల్ గుర్తింపు కార్డు, పారదర్శక వాటర్ బాటిల్ మాత్రమే వెంట తీసుకురావాలని సూచించారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, క్యాలిక్యులేటర్లు, బ్లూటూత్ పరికరాలు, హ్యాండ్ బ్యాగులు, బెల్టులు, క్యాప్‌లు, షూస్ తదితర వస్తువులను పరీక్షా కేంద్రాల్లో అనుమతించబోమని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల్లో నిరంతరాయ విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, సీసీ కెమెరాలు, ఫ్యాన్లు, లైటింగ్, ఫర్నిచర్ వంటి మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ పరీక్షా కేంద్రానికి కూడా ప్రత్యేక రవాణా సదుపాయం కల్పించినట్లు పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స సదుపాయాలు, అవసరమైన వైద్య సిబ్బంది, అత్యవసర సేవలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వర్షాలు లేదా ఇతర వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని వరంగల్ ఎన్ఐటీలో రెండు కేంద్రాలు, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ మహిళల పింగళి కళాశాల, ప్రభుత్వ పింగళి కళాశాల, యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, యూనివర్సిటీ పీజీ కళాశాల, పీఎం శ్రీ ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హై స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాకతీయ డిగ్రీ కళాశాల, లాల్ బహదూర్ కళాశాలలోని రెండు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. నీట్--2026 పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ రవి సూచించారు. ఈ సమావేశంలో నీట్ జిల్లా కోఆర్డినేటర్, నోడల్ అధికారి బిక్షపతి, హనుమకొండ ఏసీపీ నరసింహారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి గౌరీశంకర్, పోలీసు, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ అధికారులు, పరీక్షా కేంద్రాల సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



# డీసీసీబీ నోటీసు: తనఖా భూముల విక్రయానికి ఏర్పాట్లు

**కుమ్మరిగూడెం గ్రామంలో భూముల వేలానికి నోటీసు జారీ**
**జూలై 1న గ్రామ పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం**




**కరీంనగర్, 18 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) పరిధిలోని కుమ్మరిగూడెం గ్రామంలో తనఖా పెట్టిన వ్యవసాయ భూములను బహిరంగ వేలం ద్వారా విక్రయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రుణ బకాయిలు చెల్లించకపోవడంతో ఈ చర్యలు చేపట్టినట్లు బ్యాంకు వర్గాలు వెల్లడించాయి. కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన చల్లా రాజేశ్వర్‌కు సంబంధించిన వ్యవసాయ భూములపై తీసుకున్న రుణానికి బకాయిలు చెల్లించకపోవడంతో సర్వే నంబర్లు 672/2, 666/4, 665/1, 660/1, 674/6లలో ఉన్న భూములను వేలం వేయనున్నట్లు డీసీసీబీ అధికారులు జారీ చేసిన నోటీసులో పేర్కొన్నారు. ఈ బహిరంగ వేలం 2026 జూలై 1న ఉదయం 11 గంటలకు కుమ్మరిగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5,000 డిపాజిట్ చెల్లించి ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వేలంలో భూమిని దక్కించుకున్న వారు నిర్ణీత గడువులో పూర్తి మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని, నిబంధనలను ఉల్లంఘించిన పక్షంలో డిపాజిట్ జప్తు చేయబడుతుందని అధికారులు హెచ్చరించారు. సహకార సంఘాల చట్టం-1964లోని నిబంధనల మేరకు రుణ బకాయిల వసూలు కోసం ఈ వేలం నిర్వహిస్తున్నట్లు డీసీసీబీ అధికారులు తెలిపారు. వేలంలో పాల్గొనదలచిన వారు పూర్తి వివరాల కోసం సంబంధిత బ్యాంకు అధికారులను సంప్రదించాలని సూచించారు.

# విద్యా దానం మహా దానం

**పేద పిల్లల విద్యకు సహాయం చేయండి**
**పేద పిల్లల విద్యాభివృద్ధి మనందరి బాధ్యత**
**విద్యా సంవత్సర ప్రారంభంలో పేద విద్యార్థులను ఆదుకోవాలి**
**ప్రభుత్వం చేయూతనిస్తున్న విధంగా విద్యా సంస్థలు చేయితనివ్వాలి**
**డాక్టర్ అనితా రెడ్డి**





**హన్మకొండ జై భీమ్ న్యూస్:-**

అనురాగ్ సొసైటీ, రన్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి అధ్యక్షతన హన్మకొండ లోని మల్లికాంబ మనోవికాస కేంద్రం లోని బధిరులైన పిల్లలకు, బాలసదనం బాలికల ఆశ్రమం, స్వధార్ ఆశ్రమంల లోని విద్యార్థులకు , ప్రభుత్వ పాఠశాలలో చదువుచున్న అనాధ మరియు సెమి ఆర్ఫన్ పిల్లలకు, వీధి బాలల పిల్లలకు నోట్ బుక్స్, స్టేషనరీ, ఉచితంగా అందించడం జరిగింది ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ పేదరికము ఎప్పుడు విద్య కు ఆటంకము కారాదని భావించి పేద పిల్లలకు విద్యకు సహకరించాలని ఈ కార్యక్రమం నిర్వహించామని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు గత 30 సంవత్సరాలుగా ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందించడమే కాక ఫీజులు సైతం కడుతున్నామని విద్యతోనే అభివృద్ధి సాధ్యం అని అన్నారు, విద్యా దానం మహా దానం అని ప్రతి ఒక్కరూ పేద పిల్లలకు తోచిన మేర సహాయము చేయాలని అన్నారు, పిల్లలకు విద్య తోపాటు మంచి నడవడిక అవసరం అని, ప్రణాళిక బద్దంగా క్రమశిక్షణ తో లక్షసాధణ చేసి విజయం సాధించాలని,విద్యని కష్టంగా కాక ఇష్టంగా చదవాలని, విద్య విజ్ఞజణాన్నే కాక ఆర్థికంగా మెరుగుపరచి ఉన్నత శిఖరాలు చేరుస్తుందని పిల్లలకు చదువు విలువ తెలియ చేసారు, బడి వయస్సు పిల్లలు ప్రతి ఒక్కరూ చదువుకోవాలని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు, ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి, రన్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు శార్వాణి, ప్రియాంకా, కళ్యాణ్, శైలజ, కళ్యాణి,శారద, టీచర్స్, విద్యార్దులు , సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ అనితా రెడ్డి, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు.

# దళితుల సమస్యలపై కేయూ వీసీ స్పందించాలని విద్యార్థుల డిమాండ్

**దళితుల సమస్యలపై స్పందించని కేయూ వీసీకి వ్యతిరేకంగా నిరసన**
**వీసీ ప్రతాప్ రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేసిన మాదిగ విద్యార్థి వేదిక**



**హన్మకొండ, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలో దళిత ప్రొఫెసర్లు, విద్యార్థులపై జరుగుతున్న దాడుల అంశంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి స్పందించడం లేదని ఆరోపిస్తూ మాదిగ విద్యార్థి వేదిక ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. యూనివర్సిటీ పరిపాలన భవనం ఎదుట వీసీ ప్రతాప్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ గత మూడు నెలలుగా దళిత ఉద్యోగులు, విద్యార్థులు, అధ్యాపకులపై వివిధ రూపాల్లో దాడులు జరుగుతున్నప్పటికీ యూనివర్సిటీ యాజమాన్యం స్పందించడం లేదని ఆరోపించారు. దళిత ప్రొఫెసర్లపై ఆధారాలు లేని ఆరోపణలతో పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన ఘటనలపై కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. హాస్టళ్లలో విద్యార్థులపై జరిగిన దాడుల విషయంలో సైతం యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సమస్యలను పరిష్కరించకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. వీసీని స్వయంగా కలిసి వినతిపత్రాలు అందజేసినా దళిత విద్యార్థుల సమస్యలపై స్పందన లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. దళితులపై జరుగుతున్న ఘటనలపై వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు. యూనివర్సిటీలో దళిత విద్యార్థులు, అధ్యాపకులకు భద్రత కల్పించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అలువాల కార్తీక్, బొచ్చు తిరుపతి, కలకోట్ల సుమన్, మంద భాస్కర్, బొట్ల మనోహర్, మంద నరేష్, కళ్లేపల్లి ప్రశాంత్, ఎల్తూరి సాయికుమార్, పెండ్యాల రాకేష్, కుమ్మరి శ్రీనాథ్, చింత రాజు, బోస్కా నాగరాజు, గణిపాక ప్రదీప్, అడ్డూరి గణేష్, అడ్డ రాజేష్, పవన్, రొడ్డ రాంబాబు, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో 'మహిళా శక్తి క్యాంటీన్

## పరిశీలించిన డిప్యూటీ సీఎం భట్టి

**హైదరాబాద్,జూన్ 18 (జై భీమ్ న్యూస్):**


మింట్ కాంపౌండ్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయ ఆవరణలో ఉద్యోగుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన 'మహిళా శక్తి క్యాంటీన్'ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం సందర్శించి, పరిశీలించారు. క్యాంటీన్ ఏర్పాటుకు అయిన మొత్తం ఖర్చు, అక్కడ ఉద్యోగులకు కల్పించిన వివిధ రకాల వసతులు, మౌలిక సౌకర్యాల గురించి ఆ సంస్థ సీఎండీ జితేష్ వి పాటిల్‌ను డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక స్వావలంబన, ఉద్యోగులకు పరిశుభ్రమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ఈ క్యాంటీన్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. క్యాంటీన్ నిర్వాహకులతో మాట్లాడిన ఉప ముఖ్యమంత్రి.. ఉద్యోగులకు, సందర్శకులకు ఎల్లప్పుడూ సరసమైన ధరలకే నాణ్యమైన, రుచికరమైన ఆహార పదార్థాలను అందించాలని సూచించారు. అనంతరం క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన మెనూ బోర్డును, ధరల పట్టికను ఆయన నిశితంగా పరిశీలించారు. కార్యక్రమంలో సింగరేణి సిఎండి జ్యోతి బుద్ధ ప్రకాష్ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లు డైరెక్టర్ కమర్షియల్ చక్రపాణి, గారు డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటి శివాజీ , డైరెక్టర్ ఆపరేషన్స్ ఔ.నరసింహ , డైరెక్టర్ ఫైనాన్స్ కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో 23 మంది ఎస్సైల బదిలీలు

## తొమ్మిది మంది మహిళా ఎస్సైలకు కొత్త పోస్టింగ్‌లు

**వరంగల్, 18 జూన్ 2026(జై భీమ్ క్రైమ్ న్యూస్)**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లు, విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 23 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా కారణాలతో తక్షణమే అమల్లోకి వచ్చే విధంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన వారిలో ఎస్. మౌనిక (డబ్ల్యూపీఎస్-2, సుబేదారి)ను కాజీపేట పోలీస్ స్టేషన్‌కు, ఎస్. కిరణ్మయిని సీసీఆర్‌బీ వరంగల్ నుంచి భరోసా సెంటర్ హనుమకొండకు, సీహెచ్. లలితను సీపీటీసీ వరంగల్ నుంచి భరోసా సెంటర్ జనగామకు బదిలీ చేశారు. తౌటం శ్రావణిని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కేయూసీ పోలీస్ స్టేషన్‌కు, డి. నిహారికను మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు, వి. భవానిని ఐటీ సెల్ నుంచి ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. తుమ్మ శ్రావణిని భరోసా సెంటర్ హనుమకొండ నుంచి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు, ఎన్. సాయి దివ్యను హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు, కె. లక్ష్మిని భరోసా సెంటర్ జనగామ నుంచి సుబేదారి పోలీస్ స్టేషన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. బి. హరికృష్ణను సీపీటీసీ నుంచి సుబేదారి పోలీస్ స్టేషన్‌కు, సీహెచ్. రఘుపతిని పరకాల పోలీస్ స్టేషన్‌కు, వి. గోవర్ధన్‌ను ఎనుమాముల పోలీస్ స్టేషన్‌కు అటాచ్ చేశారు. ఎస్. రాజన్‌బాబును నర్సంపేట పోలీస్ స్టేషన్‌కు, బి. రవీందర్‌ను గీసుగొండ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఎల్. కొమురెల్లిని హనుమకొండ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నుంచి సీఎస్‌బీ వరంగల్‌కు, ఎన్. రవికిరణ్‌ను ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ నుంచి సీఎస్‌బీ వరంగల్‌కు, ఎస్. వెంకన్నను సుబేదారి పోలీస్ స్టేషన్ నుంచి సీఎస్‌బీ వరంగల్‌కు పోస్టింగ్ ఇచ్చారు. షేక్ జానీపాషాను ధర్మసాగర్ పోలీస్ స్టేషన్ నుంచి సీఎస్‌బీ వరంగల్‌కు బదిలీ చేసి ఐటీ కోర్ సెల్‌కు అటాచ్ చేశారు. వి. నవీన్ కుమార్‌ను కాజీపేట పోలీస్ స్టేషన్ నుంచి సీఎస్‌బీ వరంగల్‌కు బదిలీ చేసి ఐటీ కోర్ సెల్‌కు అటాచ్ చేశారు. బి. చందర్‌ను టాస్క్‌ఫోర్స్ నుంచి సీసీఎస్ వరంగల్‌కు, ఎం. రమేష్‌ను పరకాల పోలీస్ స్టేషన్ నుంచి సీసీఆర్‌బీ వరంగల్‌కు, ఎల్. నరేష్‌ను మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ నుంచి సీసీఆర్‌బీ వరంగల్‌కు బదిలీ చేశారు. ఐనవోలు ఎస్‌హెచ్‌వోగా విధులు నిర్వహిస్తున్న పి. శ్రీనివాస్‌ను పీసీఆర్ వరంగల్‌కు బదిలీ చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ శాఖలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించడం, వివిధ విభాగాల్లో సేవలను మరింత సమర్థవంతంగా అందించడమే ఈ బదిలీల లక్ష్యమని అధికారులు తెలిపారు.



# ధర్మన్న ధర్మం తప్పుతున్నాడా?

**సీకేఎం కళాశాలలో ఆరోపణలపై స్పందన ఎక్కడ?**
**విద్యార్థి సంఘాల ప్రశ్నలు**




**వరంగల్ , 18 జూన్ 2026 ( జై భీమ్ న్యూస్ )**


వరంగల్ నగరంలోని సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ సూపరింటెండెంట్‌పై చాలా కాలంగా పలు ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక చర్యలు తీసుకోకపోవడంపై విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కళాశాల విధుల సమయంలోనే సదరు ఉద్యోగి రియల్ ఎస్టేట్ వ్యాపార కార్యకలాపాల్లో పాల్గొంటున్నారనే ఆరోపణలు గత కొంతకాలంగా వెలువడుతున్నాయి. ఈ అంశంపై పలు వార్తా కథనాలు ప్రచురితమైనప్పటికీ కళాశాల యాజమాన్యం నుంచి స్పష్టమైన స్పందన లేకపోవడం విద్యార్థుల్లో అనుమానాలకు తావిస్తోందని వారు పేర్కొంటున్నారు. ఆరోపణలు వాస్తవం కాకపోతే వాటిని అధికారికంగా ఖండించడంలో కళాశాల యాజమాన్యం ఎందుకు ముందుకు రావడం లేదని, ఒకవేళ ఆరోపణల్లో నిజం ఉంటే విచారణ చేపట్టి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ముఖ్యంగా కళాశాల ప్రిన్సిపల్ మౌనం పాటించడం వెనుక కారణాలు ఏమిటన్న చర్చ విద్యార్థుల్లో కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, ఈ అంశాలపై వరుసగా కథనాలు ప్రచురిస్తున్న జై భీమ్ ప్రతినిధిపై కూడా కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే తన కథనాల్లోని అంశాలపై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రతినిధి ప్రకటించినప్పటికీ, ఇప్పటి వరకు ఎవరూ ముందుకు రాకపోవడాన్ని విద్యార్థి సంఘాలు ప్రస్తావిస్తున్నాయి. ఆరోపణలు నిరాధారమైతే వాటిని ఆధారాలతో ఖండించే ప్రయత్నం ఎందుకు జరగడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత సూపరింటెండెంట్‌పై వస్తున్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అలాగే ఈ వ్యవహారంలో ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో కళాశాల యాజమాన్యం బహిరంగంగా వెల్లడించాలని కోరుతున్నాయి. జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉన్నత విద్యామండలి అధికారులు ఈ అంశంపై దృష్టి సారించి అవసరమైతే స్వతంత్ర విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి. కళాశాల ప్రతిష్ఠ, విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా ఆరోపణలు, ప్రత్యారోపణలకు ముగింపు పలుకుతూ పారదర్శక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా వివిధ రూపాల్లో ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ స్పష్టత లేకపోవడం వల్ల ఈ వ్యవహారం ప్రస్తుతం కళాశాల వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆరోపణల్లో వాస్తవం ఎంత? అధికారుల వైఖరి ఏమిటి? సంబంధిత వర్గాలు ఎప్పుడు స్పందిస్తాయి? అనే ప్రశ్నలకు సమాధానం కోసం విద్యార్థులు,ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు ఎదురుచూస్తున్నారు.

# ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగుల ఎదురుచూపులు

**రెండున్నరేళ్లుగా ప్రకటనల కోసం నిరీక్షణ..**
**ఆర్థిక, మానసిక ఒత్తిడితో యువత అవస్థలు**

**హన్మకొండ, 18 జూన్ 2026 (జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్లు విడుదల కావడంలో జాప్యం జరుగుతుండటంతో వేలాది మంది నిరుద్యోగ యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండున్నర సంవత్సరాలుగా ఉద్యోగ ప్రకటనల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు పట్టణాల్లో రూములు అద్దెకు తీసుకుని ఉంటూ, కఠిన పరిస్థితుల్లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో కుటుంబాలకు దూరంగా ఉంటున్న పలువురు నిరుద్యోగులు ఒక పూట భోజనం చేసి మరో పూట పస్తుంటూ చదువులు కొనసాగిస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగ నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందో తెలియని అనిశ్చితి కారణంగా మానసిక ఒత్తిడికి గురవుతున్నామని చెబుతున్నారు. కోచింగ్ సెంటర్ల ఫీజులు, రూముల అద్దెలు, రోజువారీ ఖర్చులు భరించడం కష్టంగా మారిందని అభ్యర్థులు వాపోతున్నారు. కొందరు క్యాటరింగ్ పనులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తూ వచ్చిన స్వల్ప ఆదాయంతో తమ చదువును కొనసాగిస్తున్నారని తెలిపారు. పగలు పనులు చేసి, రాత్రి వేళల్లో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. తమ గ్రామాలకు వెళ్లినప్పుడు బంధువులు, స్నేహితులు "ఉద్యోగం ఎప్పుడు వస్తుంది?" అని అడుగుతున్నారని, ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మానసికంగా కుంగిపోతున్నామని పలువురు నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై నమ్మకంతో సంవత్సరాలుగా సిద్ధమవుతున్నప్పటికీ తమ సమస్యలను పట్టించుకునే వారు కనిపించడం లేదని విమర్శించారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు ఉన్నప్పటికీ నోటిఫికేషన్లు విడుదల చేయడం లేదని, దీంతో వయోపరిమితి పెరిగి అవకాశాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



# ప్రైవేటు వైద్యశాలలో 'ప్రైవేటు' వసూళ్ల దందా

**ఆరోగ్యశ్రీ పేషెంట్స్ కు అదనపు పైసల భారం**
**ఆజర హాస్పిటల్‌లో రూ.30 వేల వసూళ్ల వ్యవహారంపై విచారణ జరిపించాలి**

**ములుగు రోడ్ , 18 జూన్ 2026 ( జై భీమ్ న్యూస్ )**

పేద ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రశ్నార్థకంగా మారుతోందా..? ఆరోగ్యశ్రీ పరిధిలో చికిత్స పొందాల్సిన రోగుల నుంచి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారా..? అనే సందేహాలు తాజాగా వెలుగులోకి వచ్చిన ఓ ఘటనతో వ్యక్తమవుతున్నాయి. వరంగల్ నగరంలోని ములుగు రోడ్డులో ఉన్న ఆజర హాస్పిటల్‌లో హార్ట్ పెయిన్‌తో వచ్చిన ఓ రోగి ఆరోగ్యశ్రీలో ఓపి తీసుకొని వైద్యులకు చూపించుకున్నారు వైద్యులు యాంజియాగ్రామ్ చేయాలని సూచించినట్లు సమాచారం. అప్పటికే పేషెంట్ యాంజియోగ్రామ్ చేయడానికి అప్రూవల్ వచ్చింది కానీ ఆస్పత్రి యాజమాన్యం రోగి కుటుంబ సభ్యుల నుంచి రూ.30 వేల రూపాయలు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తర్వాత యాంజియోగ్రామ్ నిర్వహించి, స్టంట్ కూడా అమర్చినట్లు తెలుస్తోంది. అయితే చికిత్స అనంతరం రోగి బంధువులు ఆరోగ్యశ్రీ సిబ్బందిని సంప్రదించగా, సంబంధిత కేసుకు ఇప్పటికే ఆరోగ్యశ్రీ అప్రూవల్ వచ్చినట్లు వారికి తెలియజేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో "అప్రూవల్ ఉన్నప్పుడు డబ్బులు ఎందుకు చెల్లించారు..? ఎవరు చెల్లించమన్నారు..?" అని ఆరోగ్యశ్రీ మిత్ర ప్రశ్నించినట్లు తెలుస్తోంది. రోగి బంధువులు తమ వద్ద నుంచి రూ.30 వేల రూపాయలు వసూలు చేశారని రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఫిర్యాదు విషయం తెలుసుకున్న ఆస్పత్రి యాజమాన్యం, తాము తీసుకున్న డబ్బులను తిరిగి ఇవ్వడానికి సిద్ధమని, అయితే ఆరోగ్యశ్రీ మిత్ర వద్ద ఇచ్చిన ఫిర్యాదు లేఖను వెనక్కి తీసుకురావాలని కోరినట్లు ఆరోపణలు ఉన్నాయి. కానీ ఆరోగ్యశ్రీ సిబ్బంది ఆ లేఖను తిరిగి ఇవ్వడం సాధ్యం కాదని, ఆస్పత్రికి రావాల్సిన బిల్లుల నుంచి ఆ మొత్తాన్ని తగ్గించే విధానం ఉంటుందని చెప్పినట్లు సమాచారం. అనంతరం ఈ వ్యవహారం బయటకు వస్తే వివాదం అవుతుందనే ఉద్దేశంతో గుట్టుచప్పుడు కాకుండా రోగి కుటుంబ సభ్యులకు రూ.30 వేల రూపాయలను తిరిగి చెల్లించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనతో పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒక్క రోగి విషయంలో ఇలాంటి పరిస్థితి ఎదురైతే, ఇతర ఆరోగ్యశ్రీ లబ్ధిదారుల పరిస్థితి ఏమిటి..? ఇదొక ప్రత్యేక సంఘటనా..? లేక సాధారణంగా జరుగుతున్న ప్రక్రియనా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ), ఆరోగ్యశ్రీ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, ఆజర హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ రోగుల చికిత్సలకు సంబంధించిన రికార్డులు, బిల్లులు, నగదు లావాదేవీలు, ఫిర్యాదుల వివరాలను పరిశీలించాలని రోగుల బంధువులు కోరుతున్నారు. అలాగే ఈ ఆస్పత్రిపై గతంలో కూడా పలు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వివిధ పత్రికలు, మీడియా కథనాల్లో ఆస్పత్రికి సంబంధించిన అంశాలు వెలుగులోకి వచ్చినప్పటికీ అధికార యంత్రాంగం స్పందించకపోవడం పట్ల రోగులు, ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆజర హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ అమలు తీరుపై పూర్తి స్థాయి విచారణ జరిపించి, వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని, తప్పులు జరిగి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పేద ప్రజలు, రోగుల బంధువులు డిమాండ్ చేస్తున్నారు.




# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు పనిచేయాలి






**వ్యవసాయం, విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి అవసరం : ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

**వరంగల్, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ క్షేత్రస్థాయిలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సూచించారు. వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (డిశా) సమావేశంలో ఆమె వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. వ్యవసాయ రంగంపై ప్రత్యేకంగా మాట్లాడిన ఎంపీ కడియం కావ్య, రైతులకు అవసరమైన యూరియా, ఎరువులు, విత్తనాల లభ్యతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు సూచించారు. ఖరీఫ్, రబీ సీజన్లకు ముందు కేవలం కొద్ది రోజుల ప్రచార కార్యక్రమాలు కాకుండా కనీసం రెండు నెలల పాటు విస్తృత స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. రైతులతో నేరుగా సమావేశాలు నిర్వహించి పంటల నిర్వహణ, ఎరువుల వినియోగం, పురుగుమందుల నియంత్రిత వాడకంపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలని పేర్కొన్నారు. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతో పాటు ఆ ఉత్పత్తులకు మార్కెటింగ్, బ్రాండింగ్, ప్రచారం కల్పించాలని సూచించారు. అంతర పంటల సాగు (ఇంటర్ క్రాపింగ్) రైతుల ఆదాయాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తుందని, ఎక్కువ మంది రైతులు ఈ విధానాన్ని అవలంబించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. భూసార పరీక్షలు, సాయిల్ హెల్త్ కార్డుల పంపిణీని అన్ని మండలాల్లో విస్తరించాలని సూచించారు. దిశా సమావేశాల ప్రధాన ఉద్దేశ్యం క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులను ప్రజాప్రతినిధులకు తెలియజేయడమేనని పేర్కొన్న ఎంపీ, ప్రతి మూడు నెలలకు జరిగే సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలుపై స్పష్టమైన పురోగతి నివేదిక సమర్పించాలని కోరారు. గత సమావేశ నిర్ణయాల్లో కేవలం 20 శాతం మాత్రమే పురోగతి కనిపించిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. డీపీఆర్‌లు, టెండర్ల ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని తగ్గించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నందున అధికారులు కూడా అదే స్థాయిలో చురుకుదనం ప్రదర్శించాలని సూచించారు. జిల్లాలో విద్య, వైద్య రంగాల బలోపేతంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపౌట్స్ తగ్గించి విద్యార్థుల నమోదు (ఎన్‌రోల్‌మెంట్) పెంచేందుకు చర్యలు చేపట్టాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. చిన్నారులకు గుడ్ టచ్--బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పనలో ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరం

**ఎస్ఐఆర్-2026పై అవగాహన కల్పించేందుకు 2కె రన్ ప్రారంభించిన కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి**

**హన్మకొండ, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అయిన ఓటరు జాబితాను మరింత సమగ్రమైనదిగా, విశ్వసనీయమైనదిగా తీర్చిదిద్దేందుకు భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026)లో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చాహాత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. ఎస్ఐఆర్-2026పై ఓటర్లలో అవగాహన పెంపొందించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 2కె రన్‌ను హనుమకొండ అదాలత్ సర్కిల్‌లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద డీసీపీ ధార కవితతో కలిసి కలెక్టర్ చాహాత్ బాజ్‌పాయి ప్రారంభించారు. అక్కడి నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయడంలో ఖచ్చితమైన ఓటరు జాబితా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి పౌరుడు తన పేరు ఓటరు జాబితాలో నమోదైందో లేదో పరిశీలించుకోవడంతో పాటు అవసరమైన సవరణలు, మార్పులు, చేర్పులు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు), రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) సమక్షంలో ఇంటింటికీ వెళ్లి డిక్లరేషన్ ఫారాలు, ఎన్‌మరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని తెలిపారు. ప్రజలు ఈ ప్రక్రియకు సహకరించి సరైన సమాచారాన్ని అందించాలని కోరారు. సేకరించిన వివరాల ఆధారంగా జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించబడుతుందని, అభ్యంతరాలు, క్లెయిమ్‌ల పరిశీలన అనంతరం అక్టోబర్ 1న తుది ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఎవరైనా తప్పు సమాచారం అందించినా వెంటనే పేరు తొలగించకుండా నోటీసు జారీ చేసి విచారణ అనంతరం నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, మరణించిన వ్యక్తులు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓటర్ల వివరాలను గుర్తించి జాబితాను పరిశుద్ధీకరించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రస్తుతం ఓటరు జాబితాలో పేరు లేని అర్హులైన పౌరులు తప్పనిసరిగా ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే ప్రతి భారతీయ పౌరుడు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హుడని పేర్కొన్నారు. అర్హత కలిగిన ఏ ఒక్కరి పేరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా ఎన్నికల సంఘం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. ఓటర్లకు అవసరమైన సమాచారం అందించేందుకు జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఈఆర్‌వో కార్యాలయం, సంబంధిత తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాలు, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లతో పాటు 1950 టోల్ ఫ్రీ సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ ధార కవిత, అదనపు కలెక్టర్ రవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



# గుర్తు తెలియని వృద్ధురాలికి ఆశ్రయం కల్పించిన లార్డ్ ఆశ్రమం

**శాంతినగర్‌లో నిరాశ్రయ స్థితిలో ఉన్న మహిళను చేరదీసిన నిర్వాహకులు**

**హన్మకొండ, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 22వ డివిజన్ శాంతినగర్ ప్రాంతంలో గత రెండు రోజులుగా గుర్తు తెలియని ఓ వృద్ధురాలు నిరాశ్రయ స్థితిలో ఉండడాన్ని గమనించిన స్థానికులు మానవతా దృక్పథంతో స్పందించి ఆమెకు ఆశ్రయం కల్పించారు. మాజీ కార్పొరేటర్ బస్వారాజు కుమార్ సమాచారం మేరకు లార్డ్ నిరాశ్రయుల ఆశ్రమం నిర్వాహకులు వెంటనే స్పందించి వృద్ధురాలిని చేరదీశారు. ఆశ్రమ నిర్వాహకులు డాక్టర్ నారగాని నరేశ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, వృద్ధురాలు దుర్వాసనతో, తిండి తిప్పలు లేకుండా దయనీయ స్థితిలో రోడ్డుపై కనిపించింది. ఆమె వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేయగా, కరీంనగర్ జిల్లా కేశవపట్నం సమీపంలోని గద్దెపాక గ్రామానికి చెందినట్లు చెబుతూనే, మరోసారి ఆంధ్రప్రదేశ్‌కు చెందినట్లు పేర్కొనడం, కుటుంబ సభ్యుల వివరాల విషయంలో స్పష్టత ఇవ్వలేకపోవడంతో మానసికంగా కొంత ఇబ్బంది పడుతున్నట్లు గుర్తించారు. అనంతరం వృద్ధురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి, వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ), పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సహకారంతో లార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలివెల్పుల రోడ్డులో నిర్వహిస్తున్న నిరాశ్రయుల ఆశ్రమానికి తరలించి ఆశ్రయం కల్పించారు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు లేదా బంధువులు ఎవరైనా గుర్తిస్తే 7396507272, 9849091501 నంబర్లను సంప్రదించాలని ఆశ్రమ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మడిపెల్లి వేణు, పొన్న నాగరాజు, కడారి బుచ్చిరెడ్డి, తాటికొండ దామోదర్, ఎలుగం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజమంతా భాగస్వాములు కావాలి

**జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



**హన్మకొండ, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు "నషా ముక్త భారత్ అభియాన్" కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జూన్ 19 నుంచి 25 వరకు "నషా ముక్త సప్తాహం" నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతూ గురువారం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. రవితో కలిసి అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో చైతన్యం కల్పించేందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు, క్విజ్ పోటీలు, డ్రాయింగ్ పోటీలు, స్లోగన్ రైటింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని "సే నో టు డ్రగ్స్" అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి యువతలో ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. జూన్ 25న జిల్లా కేంద్రంలో అన్ని శాఖల అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మాదకద్రవ్యాల వ్యసనం వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే "నషా ముక్త భారత్ అభియాన్" ప్రధాన లక్ష్యమని, ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత మార్కెట్లే లక్ష్యం

**ప్రత్యామ్నాయ బ్యాగుల ప్రత్యేక స్టాల్‌ను ప్రారంభించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి**



**హన్మకొండ, 18 జూన్ 2026(జై భీమ్ న్యూస్)**

పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య రక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, మార్కెట్లను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు సమష్టి కృషి అవసరమని జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయి అన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) ఆధ్వర్యంలో హనుమకొండ ఎక్సైజ్ కాలనీ రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన జూట్, క్లాత్, బయోడిగ్రేడబుల్ బ్యాగుల ప్రత్యేక స్టాల్‌ను గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు ప్రజల ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్ బ్యాగులు, క్లాత్ బ్యాగులు, బయోడిగ్రేడబుల్ బ్యాగుల వినియోగాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని సూచించారు. మార్కెట్ ప్రాంతాల్లో వ్యాపారులు, వినియోగదారులు ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని పూర్తిగా మానుకుని పర్యావరణ హిత ఉత్పత్తులను వినియోగించాలని కోరారు. మార్కెట్లను దశలవారీగా ప్లాస్టిక్ రహిత మార్కెట్లుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రత్యేక స్టాల్ ద్వారా ప్రజలకు అందుబాటు ధరల్లో ప్రత్యామ్నాయ బ్యాగులు లభిస్తాయని, వాటిని వినియోగించడంతో పాటు కుటుంబ సభ్యులు, స్నేహితులు, పొరుగువారిలో కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో సీఎం హెచ్ఓ రాజారెడ్డి, ఆర్డీఓ వెంకటేష్, జీడబ్ల్యూఎంసీ అధికారులు, బల్దియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లంచాలు తీసుకుంటే తక్షణ సస్పెన్షన్: రవాణాశాఖ విజిలెన్స్ జేటీసీ చంద్రశేఖర్ గౌడ్ హెచ్చరిక

**హైద్రాబాద్,18 జూన్ 2026(జై భీమ్ న్యూస్ )**

రవాణాశాఖలో అవినీతి, దళారుల వ్యవహారాలు, సిబ్బంది ఉపయోగిస్తున్న రహస్య 'కోడ్'లపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఏజెంట్ల నుంచి లంచాలు స్వీకరించిన సిబ్బందిపై విచారణ పెండింగ్‌లో ఉంచి తక్షణమే సస్పెండ్ చేస్తామని రవాణాశాఖ విజిలెన్స్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎం. చంద్రశేఖర్ గౌడ్ హెచ్చరించారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాలు, డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ల నిర్వహణపై కీలక ఆదేశాలు జారీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ పరీక్షల్లో పారదర్శకత పెంచేందుకు కఠిన నిబంధనలు అమలు చేయాలని సూచించారు. డ్రైవింగ్ టెస్ట్‌కు హాజరయ్యే అభ్యర్థుల గుర్తింపును ఆధార్ లేదా ఇతర ప్రభుత్వ గుర్తింపు కార్డుల ద్వారా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు స్వయంగా ధ్రువీకరించాలని ఆదేశించారు. కేవలం నామమాత్రపు పరీక్షలు నిర్వహించి లైసెన్స్‌లు జారీ చేయరాదని, వాహనాన్ని స్టార్ట్ చేయడం నుంచి రివర్స్ డ్రైవింగ్, లేన్ డిసిప్లిన్, ట్రాఫిక్ నియమాల పాటింపు వరకు అన్ని అంశాల్లో అభ్యర్థుల నైపుణ్యాన్ని పరీక్షించాలన్నారు. ప్రతి డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ప్రవేశ ద్వారం వద్ద "ప్రైవేటు ఏజెంట్లకు ప్రవేశం నిషేధం" అనే బోర్డులు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. డ్రైవింగ్ ట్రాక్‌లు, రవాణా శాఖ కార్యాలయాల్లోకి బ్రోకర్లు, ఏజెంట్లు, డ్రైవింగ్ స్కూల్ ప్రతినిధులను అనుమతించరాదని స్పష్టం చేశారు. రవాణా శాఖ కార్యాలయాల్లోని అన్ని సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, కెమెరాలు పనిచేయకపోయినా లేదా నిఘా వ్యవస్థను ట్యాంపరింగ్ చేసినా సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఏసీబీ అధికారులు లేదా ఉన్నతాధికారుల తనిఖీల సమాచారాన్ని ముందుగానే చేరవేయడానికి సిబ్బంది 'కోడ్'లు, సంకేత పదాలు, నంబర్ సీక్వెన్స్‌లు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. తమ పరిధిలో ఇలాంటి అక్రమాలకు తావులేకుండా చూడాల్సిన పూర్తి బాధ్యత కార్యాలయ అధికారులదేనని పేర్కొన్నారు. ప్రతి నెల 15వ తేదీలోపు అమలు నివేదికను కమిషనర్ కార్యాలయానికి సమర్పించాలని జేటీసీ చంద్రశేఖర్ గౌడ్ ఉత్తర్వుల్లో ఆదేశించారు. దీంతో రవాణాశాఖలో అవినీతికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం మరింత కఠిన చర్యలకు సిద్ధమైనట్లు స్పష్టమవుతోంది.

# ప్రతి చిన్నారి బడిబాటలోకి.. జయగిరిలో ఘనంగా బడిబాట కార్యక్రమం

**హసన్‌పర్తి, జూన్ 18 (జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచడం, పాఠశాల వయస్సు పిల్లలందరికీ విద్య అందేలా చూడడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "బడిబాట" కార్యక్రమం హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం జయగిరి గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు ఇంటింటికి వెళ్లి పాఠశాల వయస్సు పిల్లలను గుర్తించారు. విద్యకు దూరంగా ఉన్న పిల్లలు ఎవరైనా ఉంటే వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం, డిజిటల్ విద్య, ఆంగ్ల మాధ్యమ బోధనతో పాటు ప్రభుత్వం కల్పిస్తున్న ఇతర సౌకర్యాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ తాళ్లపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి చిన్నారి తప్పనిసరిగా పాఠశాలలో చేరి విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. గ్రామంలో ఒక్క చిన్నారి కూడా విద్యకు దూరంగా ఉండకూడదనే లక్ష్యంతో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలంటే ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. "ప్రతి చిన్నారి పాఠశాలకు", "చదువే భవిష్యత్తుకు బాట", "విద్య హక్కు – అందరికీ హక్కు" వంటి నినాదాలతో గ్రామ వీధుల్లో ర్యాలీ చేపట్టి ప్రజల్లో విద్యాపై చైతన్యం కల్పించారు. గ్రామస్తులు కూడా కార్యక్రమానికి విశేష స్పందన తెలియజేశారు. బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరుగుతాయని, గ్రామంలో శాతం శాతం నమోదు లక్ష్యాన్ని సాధించవచ్చని ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యాభివృద్ధికి గ్రామస్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు మరియు విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**హైదరాబాద్,జూన్ 18 (జై భీమ్ న్యూస్):**

రాష్ట్రంలోని మైనార్టీల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఇందుకోసం బడ్జె ట్‌లో భారీగా నిధులను కేటాయించామని, వాటికి సంబంధించిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మైనార్టీల సంక్షేమం, వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శనివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు. ఉర్దూ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు అన్ని జిల్లా కేంద్రాల్లో ఉర్దూ సంస్కృతిని ప్రతిబింబించేలా పెద్ద ఎత్తున 'ముషాయిరా' (కవి సమ్మేళనాలు) నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఈ కార్యక్రమం నిర్వాహణకు తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలను అన్ని రకాల ఆధునిక హంగులు, వసతులతో నిర్మిస్తున్నట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 17 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా వివరించారు. దీనిపై భట్టి విక్రమార్క స్పందిస్తూ... అసంపూర్తిగా మిగిలిపోయిన మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల భవనాల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. పనులు ఎక్కడా ఆగకుండా ఒక నిర్ణీత టైమ్ క్యాలెండర్‌ను రూపొందించుకుని, దాని ప్రకారమే పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని, మిగిలిన 17 పాఠశాల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు మరియు వారిని ఆర్థికంగా నిలబెట్టడానికి రాజీవ్ యువ వికాసం' పథకం ద్వారా పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. క్రిస్టియన్ మైనార్టీల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా రూ. 50 కోట్లు ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నిధులను క్రిస్టియన్ మైనార్టీ యువత స్వయం ఉపాధి రంగంలో రాణించడానికి తగిన ఆర్థిక ప్రోత్సాహం అందించడానికి కేటాయిస్తామన్నారు. మైనార్టీ సంస్థలకు సంబంధించిన విలువైన వక్ఫ్ మరియు ఇతర భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు తగిన చట్టపరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, మైనార్టీల స్మశాన వాటికల చుట్టూ ప్రహరీ గోడల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ఇందుకోసం తక్షణమే ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు.

## సమంత 'మా ఇంటి బంగారం' విడుదల.. అంచనాలు పెంచుతున్న బుకింగ్స్



స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం విడుదలకు ముందే సంచలనం సృష్టిస్తోంది. రేపు (జూన్ 19న) ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్న ఈ సినిమాకు అడ్వాన్స్ బుకింగ్స్ భారీ స్థాయిలో జరుగుతున్నాయి. పలు ప్రధాన నగరాల్లో షోలు వేగంగా నిండుతుండటంతో సినిమాపై నెలకొన్న అంచనాలు స్పష్టమవుతున్నాయి. ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ నిర్మించిన ఈ సినిమా బుకింగ్స్ చాలా వేగంగా జరుగుతున్నాయని చిత్ర యూనిట్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. గంట వ్యవధిలోనే దాదాపు 3.49 లక్షల టిక్కెట్లు బుక్ అయినట్లు వారు ప్రకటించడం సినిమాపై ఉన్న క్రేజ్‌కు అద్దం పడుతోంది. ఈ ట్రెండ్ చూస్తుంటే సినిమాకు తొలిరోజు అదిరిపోయే ఓపెనింగ్స్ ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.'ఓ బేబీ' ఫేమ్ నందినీ రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా, సమంత భర్త రాజ్ నిడిమోరు క్రియేటర్‌గా వ్యవహరించారు. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ సంతోష్ నారాయణన్ సంగీతం అందించడం సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ. సమంత, నందినీ రెడ్డి, రాజ్ నిడిమోరు వంటి విలక్షణమైన ప్రతిభావంతుల కలయికలో వస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.

## రష్మిక 'మైసా' నుంచి అప్‌డేట్.. సాంగ్ షూటింగ్ పూర్తి!

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' నుంచి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలోని ఒక కీలకమైన పాట చిత్రీకరణ పూర్తయినట్లు చిత్ర దర్శకుడు రవీంద్ర పుల్లే వెల్లడించారు. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో సెట్స్‌కు సంబంధించిన ఫోటోను పంచుకుంటూ, "చవీఎఘు సాంగ్ ప్యాకప్" అని ఆయన పోస్ట్ చేశారు. రష్మికపై చిత్రీకరించిన ఈ పాటకు ప్రముఖ కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ నృత్య దర్శకత్వం వహించారు.ఈ చిత్రం ప్రకటించినప్పటి నుంచే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల కేరళలో ఈ సినిమాకు సంబంధించి ఒక సుదీర్ఘ షెడ్యూల్ పూర్తయిన సంగతి తెలిసిందే. ఆ షెడ్యూల్‌లో స్టంట్ మాస్టర్ కెచా కంపాక్డీ పర్యవేక్షణలో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారు. ఇందులో రష్మిక స్వయంగా కొన్ని హై-ఇంటెన్సిటీ యాక్షన్ సీక్వెన్స్‌లలో నటించినట్లు సమాచారం.ఈ యాక్షన్ సన్నివేశాల్లో సహజంగా నటించేందుకు రష్మిక థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. అక్కడ రోజూ 8 గంటల పాటు శ్రమించి, అంతర్జాతీయ నిపుణుల వద్ద అధునాతన స్టంట్స్, హ్యాండ్-టు-హ్యాండ్ కంబాట్ వంటివి నేర్చుకున్నారు. ఈ చిత్రంలో రష్మిక ఒక గిరిజన (గోండు) యువతి పాత్రలో కనిపించనున్నారు. శారీరకంగా, మానసికంగా ఎంతో శ్రమ అవసరమైన ఈ పాత్ర కోసం ఆమె ప్రత్యేకంగా సిద్ధమయ్యారు.అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్ ఆండీ లాంగ్ ఈ చిత్రానికి స్టంట్స్ పర్యవేక్షిస్తున్నారు. రష్మికతో పాటు ఈశ్వరీ రావు, గురు సోమసుందరం, రావు రమేశ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. శ్రేయాస్ పి కృష్ణ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జేక్స్ బిజోయ్ సంగీతం సమకూరుస్తున్నారు.





# ఈ మార్నింగ్ రొటీన్‌తో నెగెటివ్ ఆలోచనలకు చెక్ పెడుతున్న సమంత!

**రోజూ ఉదయం 5:30 నిద్ర లేస్తానన్న సమంత**

**లేవగానే కృతజ్ఞతా డైరీ రాస్తానన్న స్టార్ హీరోయిన్**

**తర్వాత ఎండలో ఐదు నిమిషాలు**

**అనంతరం అరగంట ధ్యానం**

**ఈ రొటీన్‌తో ఆత్మన్యూనత, భయాలు పోగొట్టుకోవచ్చని హితవు**

స్టార్ హీరోయిన్ సమంత తన వ్యక్తిగత జీవితంలో ఎదురైన ఎన్నో ఒడుదొడుకులను ధైర్యంగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారు. అయితే తనలో కలిగే ఆత్మన్యూనత భావం, నెగెటివ్ ఆలోచనలను ఎలా అధిగమిస్తుందో తాజాగా అభిమానులతో పంచుకున్నారు.గతంలో తన డైలీ మార్నింగ్ రొటీన్‌పై ఓ వీడియోను పంచుకున్నానని గుర్తు చేసిన సమంత.. అది కేవలం వీడియో కోసం చెప్పింది కాదన్నారు. ఉదయం ఎండలో కొంతసేపు గడపడం, కృతజ్ఞతా డైరీ రాయడం, ధ్యానం చేయడం, దేవుడికి కృతజ్ఞతలు చెప్పడం వంటి అలవాట్లు తన మనసులోని గందరగోళాన్ని తగ్గించాయని తెలిపింది. ఇవి నెగెటివ్ ఆలోచనలను దూరం చేయడంలో ఎంతో సాయపడ్డాయని పేర్కొంది."ప్రతి ఒక్కరికీ భయాలు ఉంటాయి. ఆత్మన్యూనత కూడా ఉంటుంది. కానీ ఒక క్రమబద్ధమైన రొటీన్‌ను పాటిస్తే వాటిలో చాలా వరకు సహజంగానే తగ్గిపోతాయి. నేను నా అనుభవంతో చెబుతున్నాను" అని సమంత పేర్కొంది.అంతకుముందు 2024లో షేర్ చేసిన మరో వీడియోలో తన పూర్తి మార్నింగ్ రొటీన్‌ను కూడా వెల్లడించింది. రోజూ ఉదయం 5.30 గంటలకు లేస్తానని, వెంటనే కృతజ్ఞతా డైరీ రాస్తానని తెలిపింది. ఆ తర్వాత ఐదు నిమిషాలు ఎండలో గడపడం, శ్వాస వ్యాయామాలు చేయడం, సుమారు 25 నిమిషాలు ధ్యానం చేయడం తన దినచర్యలో భాగమని చెప్పింది.ఇటీవల 'ట్యాపింగ్' అనే పద్ధతిని కూడా అలవాటు చేసుకున్నానని సమంత వెల్లడించింది. ఇది శరీరంలోని ఎనర్జీ బ్యాలెన్స్‌ను కాపాడటంతో పాటు నొప్పులను తగ్గించడంలో ఉపయోగపడుతుందని తెలిపింది. ఈ అలవాట్లన్నింటినీ ఒకేసారి మొదలుపెట్టాల్సిన అవసరం లేదని, ఒక్కటి లేదా రెండింటితో ప్రారంభించినా మంచి మార్పు కనిపిస్తుందని అభిమానులకు సూచించింది. సమంత తాజా చిత్రం 'మా ఇంటి బంగారం' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా రేపు (జూన్ 19) ప్రేక్షకుల ముందుకు రానుంది.